
సాక్షి పెద్దపల్లి

సోమవారం । 11 । డిసెంబర్ । 2023



ముగిసిన పోచమ్మ ఉత్సవాలు

జూలపల్లి : కాచాపూర్‌లో పోచమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



చెక్‌డ్యామ్‌కు జలకళ

సుల్తానాబాద్‌రూరల్: నీరుకుల్ల వద్ద మానేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం జలకళ సంతరించుకుంది. శ్రీరంగనాయకస్వామి భక్తులు అక్కడకు వచ్చి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /25.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళా సంక్షేమానికి అండ



బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్

పెద్దపల్లిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ఆర్టీవో మధుమోహన్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. మహిళలు తమ అవసరాలకు అనుగుణంగా సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ బస్సులో ఆయన మహిళలతో కలిసి ప్రయాణించారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల కోలాహలం



దర్శనం కోసం వచ్చిన భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు సమీప గ్రామాల నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మల్లికార్జునస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి, నందీశ్వరులను దర్శనం చేసుకున్నారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో సదయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జీడీకే-5 ఓసీపీ సందర్శన



క్వారీ పరిశీలిస్తున్న డైరెక్టర్(పా) బలరాం

గోదావరిఖని: రామగుండం డివిజన్-1 పరిధిలోని జీడీకే-5 ఓసీపీని డైరెక్టర్(పా) బలరాం ఆదివారం తనిఖీ చేశారు. రక్షణ ఏర్పాట్లు తదితర వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో చేపట్టవలసిన ప్రణాళికల గురించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన వెంట ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఇంజినీర్ ఎస్‌వీరావు, మేనేజర్ అనిల్‌గబాలే, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: యూనియన్ గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ కోరారు. ఆదివారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. త్యాగధనులు నిర్మించిన సంఘం, చరిత్ర కలిగిన యూనియన్‌గా ఎన్నోహక్కులు సాధించిందన్నారు. దీపావళి బోనస్, లాభాల్లో వాటా, పింఛన్, రఘునాథరెడ్డి అవార్డు ద్వారా ఎక్కువ కేటగిరీ లాంటి విశిష్టమైన హక్కులు సాధించిన చరిత్ర ఏఐటీయూసీకి ఉందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా నీతి, నిజాయితీగా పనిచేస్తామని వారు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు ఆరెల్లి పోశం, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, గౌతం గోవర్ధన్, కె.కనకరాజు, కన్నం లక్ష్మీనారాయణ, రంగు శ్రీనివాస్, సంకె అశోక్, మాదన మహేశ్, మద్దెల దినేశ్, ఎంఏగౌస్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారుకు సహకరిస్తాం

మంథని: సంక్షేమ పథకాల అమలులో సర్కారుకు తాము సంపూర్ణంగా సహకరిస్తామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లింగం శ్రీనివాస్ తెలిపారు. ప్రజాస్వామిక ఆకాంక్ష నెరవేర్చడానికి, ప్రజా సమస్యలను తీర్చడానికి ప్రజాదర్బార్ నిర్వహించడం, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను తొలిసారి మేనిఫెస్టోలో పెట్టినందుకు ఉద్యోగ, ఉపాధ్యాయుల తరఫున కృతజ్ఞతలని అన్నారు. తక్షణమే సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛన్ పునరుద్ధరించాలని ఆయన కోరారు.

16 కంపెనీలు.. 25 జట్లు

- నేటి నుంచి ఆలిండియా స్థాయి రెస్క్యూ పోటీలు
- 15వ తేదీ వరకు నిర్వహణ.. ఆతిథ్యం ఇస్తున్న సింగరేణి
- పోటీలకు సర్వసన్నద్ధమైన సింగరేణి జట్లు
- తొలిసారి బరిలో మహిళా రెస్క్యూ జట్టు



గోదావరిఖని చేరుకున్న సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ జట్టు

గోదావరిఖని: ఆలిండియా రెస్క్యూ పోటీలకు సింగరేణి మెయిన్ రెస్క్యూస్టేషన్ ముస్తాబైంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు పోటీలు నిర్వహిస్తారు. దేశంలోని కోల్‌మైన్స్‌కు చెందిన 16 జట్లు, మెటల్ మైన్స్‌కు చెందిన 9 జట్లు హాజరవుతాయి. దశాబ్దం తర్వాత ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీలకు సింగరేణి ఆతిథ్యం ఇస్తోంది. రామగుండం రీజియన్ -2లోని మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో పోటీలు నిర్వహిస్తారు. 10కోల్‌మైన్స్, 9 మెటల్ మైన్స్ బృందాలు పాల్గొంటున్నాయి. 52వ ఆలిండియా మైన్స్‌రెస్క్యూ పోటీలకు దేశవ్యాప్తంగా 16 కంపెనీలకు చెందిన 25జట్లు హాజరు కానున్నాయి. ఇందులో 10 కోల్ కంపెనీలు, 9 మెటల్ కంపెనీలు ఉన్నాయి. సింగరేణి తరఫున రెండు జట్లు హాజరవుతాయి. హిందూస్థాన్ జింక్ లిమిటెడ్‌కు చెందిన ఒక మహిళా జట్టు పాల్గొనడం విశేషం.

సింగరేణికి ప్రతిష్టాత్మకం..

- సింగరేణి ప్రతిష్టకు అనుగుణంగా పోటీలు నిర్వహించాలని నిర్ణయించింది.
- ఆర్జీ-2 ఏరియా మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- పలు రాష్ట్రాల నుంచి వచ్చే జట్లకు రెండు జిల్లాల్లోని లాడ్జిల్లో వసతీసౌకర్యాలు కల్పించారు.
- ప్రమాదాల సమయంలో తామున్నామంటూ కార్మికుల్లో ధైర్యం నింపడం, భరోసా కల్పించడం కోసం సేవలు అందిస్తున్న రెస్క్యూ సింగరేణి బొగ్గు గనులకు గుండెకాయలాంటిది.
- సింగరేణి రెస్క్యూ అద్భుత ప్రతిభతో ఆలిండియా పోటీల్లో సత్తా చాటుతూ వస్తోంది.
- ఇప్పటికే డబుల్ హాట్రిక్‌తో తన ప్రత్యేకత చాటుకుంది.
- 1994 నుంచి ఆలిండియా స్థాయి పోటీల్లో పాల్గొంటున్న సింగరేణి.. 28ఏళ్లుగా అనేక అవార్డులు, రివార్డులు సొంతం చేసుకుంది.
- అత్యాధునిక శిక్షణతో భూగర్భ గనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు తామున్నామంటూ కార్మికుల్లో భరోసా నింపుతోంది.
- ఆలిండియా 51వ రెస్క్యూ పోటీలు గతేడాది రాజస్థాన్‌లోని దరిభాలో హిందూస్థాన్ జింక్ లిమిటెడ్(హెచ్‌జడ్ఎల్)లో జరిగాయి.
- ఈపోటీల్లో సింగరేణి జట్టు ఓవరాల్ చాంపియన్ సాధించింది.
- ట్రర్న్ అవుట్ అండ్ డ్రిల్, థియరీటెస్ట్, స్టాట్యుటరీ టెస్ట్, ఫస్ట్‌ఎయిడ్ ప్రాక్టికల్, ఫ్రెష్ ఎయిర్ బేస్ అండ్ డ్రిల్, రెస్క్యూ అండ్ రికవరీ డ్రిల్, క్యాప్టెన్ రిపోర్ట్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు.



పోటీలకు సర్వసన్నద్ధమైన మెయిన్ రెస్క్యూ స్టేషన్

తొలిసారి మహిళా జట్టు ప్రాతినిధ్యం

గోదావరిఖని: ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీలకు తొలిసారి మహిళా టీం హాజరవుతోంది. ఆదివారం మెయిన్ రెస్క్యూ స్టేషన్‌కు సభ్యులు చేరుకోగా సంస్థ తరఫున అధికారులు స్వాగతం పలికారు. రాజస్థాన్‌లోని హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ సంస్థ నుంచి ఈ టీం పోటీల్లో పాల్గొంటోంది. ఈజట్టుకు కెప్టెన్‌గా భూపాల్‌పల్లి ఏరియాకు చెందిన సింగరేణి కార్మికుడి కూతురు, అండర్ మేనేజర్ రాసకట్ల సంధ్య సారథ్యం వహిస్తున్నారు.



ఖనికి చేరుకున్న మహిళా రెస్క్యూ టీం

ఆలిండియా స్థాయిలో ఏర్పాట్లు

ఆలిండియా స్థాయిలో రెస్క్యూ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నాం. దేశంలోని అన్ని కోల్‌మైన్స్, మెటల్ మైన్స్‌కు చెందిన రెస్క్యూ బృందాలు పోటీలకు హాజరవుతున్నాయి. ప్రమాదాల సమయంలో అప్రమత్తత కోసం ఏటా దేశంలోని ఒక సంస్థలో ఆలిండియా రెస్క్యూ పోటీలు నిర్వహిస్తున్నారు. హిందూస్థాన్ జింక్ సంస్థ నుంచి ఈసారి మహిళా జట్టు పాల్గొనడం విశేషం. 53వ ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీల్లో సింగరేణి నుంచి కూడా మహిళా జట్టు పాల్గొనేలా చర్యలు తీసుకుంటాం.

– శ్యామిత్రా, డీఎంఎస్

నోటీసులతోనే సరి..!

- నేటికీ పూర్తికాని సీఎంఆర్ డెలివరీ ప్రక్రియ
- మరోసారి గడువు పెంచిన అధికారులు
- లక్ష్య సాధనకు మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్న వైనం



సీఎంఆర్ సమాచారం

2022-23 - వానాకాలం

ఇవ్వాల్సిన సీఎంఆర్
2,00,837 మెట్రిక్ టన్నులు

ఇప్పటివరకు డెలివరీ చేసిన సీఎంఆర్
1,07,313 మెట్రిక్ టన్నులు

ఇంకా డెలివరీ చేయాల్సింది
93,524 మెట్రిక్ టన్నులు

డెలివరీ చేసిన సీఎంఆర్: 51 శాతం

2022-23 - యాసంగి

ఇవ్వాల్సిన సీఎంఆర్
2,39,327 మెట్రిక్ టన్నులు

ఇప్పటివరకు డెలివరీ చేసిన సీఎంఆర్
49,418 మెట్రిక్ టన్నులు

ఇంకా డెలివరీ చేయాల్సింది
1,89,909 మెట్రిక్ టన్నులు

డెలివరీ చేసిన సీఎంఆర్ : 21 శాతం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రైస్‌మిల్లర్లకు అప్పగించిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) డెలివరీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ధాన్యం మరపట్టి బియ్యాన్ని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కు నిర్దేశిత గడువులోగా అప్పగించాలని జిల్లా పౌర సరఫరాల అధికారులు అనేక పర్యాయాలు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రావడంలేదు. ఇటీవల మిల్లర్లతో సమావేశమైన అధికారులు.. ఈనెలాఖరులోగా బియ్యం అప్పగించాలని తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీచేశారు. అయినా, ఆయా మిల్లుల్లో ఆశించిన స్థాయిలో ధాన్యం మరపట్టే ప్రక్రియ సాగడం లేదని తెలుస్తోంది.

వానాకాలం 53శాతం.. యాసంగి 21శాతం..

- గత వానాకాలం(2022-23) సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని పలువురు రైస్‌మిల్లర్లకు అధికారులు అప్పగించారు. వడ్లను మరపట్టిన మిల్లర్లు.. ఇప్పటివరకు సుమారు 53శాతం ఎఫ్‌సీఐకి డెలివరీ చేశారు.
- ఇదే ఏడాది యాసంగికి సంబంధించి కేటాయించిన ధాన్యం మరపట్టిన రైస్‌మిల్లర్లు ఇప్పటివరకు కేవలం 21శాతమే డెలివరీ చేసినట్లు అధికారుల గణాంకాలను బట్టి తెలుస్తోంది.
- ఇలాంటి పరిస్థితుల్లో ఈనెలాఖరుకల్లా సీఎంఆర్ ప్రక్రియ పూర్తిచేయడం సాధ్యమేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గడువులపై గడువులు పొడిగింపు..

పెండింగ్ సీఎంఆర్‌ను సకాలంలో డెలివరీ చేయడంలో మిల్లర్లు విఫలమవుతున్నారు. మిల్లర్లతో జిల్లా ఉన్నతాధికారులు తరచూ సమావేశాలు నిర్వహిస్తూ ధాన్యం మరపట్టి బియ్యాన్ని వెంటనే ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని సూచిస్తున్నా రైస్ మిల్లర్లు నిర్దేశిత లక్ష్యం చేరుకోవడం లేదు. ఎప్పటికప్పుడు తుదిగడువు పొడిగిస్తూనే వస్తున్నారు. తాజాగా ఈనెలాఖరును తుది గడువుగా అధికారులు విధించారు. ఈ గడువులోగా సీఎంఆర్ పూర్తికావడం గగనమేననే అభిప్రాయాలున్నాయి.

సమావేశాలతోనే సరి..

- సీఎంఆర్‌కు సంబంధించిన ధాన్యం నిల్వల నిగ్గు తేల్చడంలో అధికారులు తగిన శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి.
- ప్రధానంగా జిల్లాలో ఎన్ని మిల్లులకు ధాన్యం కేటాయించారు, అందులో ఎన్ని వడ్లు మరపట్టారు?, ఎన్ని బియ్యం ఎఫ్‌సీఐకి ఇచ్చారు, ఇంకా నిల్వలు ఎన్ని ఉన్నాయి? అనే సమాచారం తెలుసుకునేందుకు అధికారులు తరచూ తనిఖీలు చేయాల్సి ఉంది.
- కానీ, అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.
- ఫలితంగా కొందరు మిల్లర్లు ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని అమ్ముకోగా.. అధికారుల ఒత్తిడితో రేషన్‌బియ్యాన్ని తెచ్చి వాటిస్థానంలో రీ సైక్లింగ్ చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా ఉన్నాయి.
- రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేయాల్సిన అధికారులు మిల్లర్లతో తరచూ సమావేశాలను నిర్వహిస్తూ పెండింగ్ రైస్ డెలివరీ చేయాలంటూ ఆదేశాలతోనే సరిపెడుతున్నారనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక దృష్టి సారించాం

కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) నిర్దేశిత గడువులోగా అప్పగించాలని జిల్లాలోని రైస్‌మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నాం. నిర్దేశిత లక్ష్యం చేరని మిల్లర్లకు ఇప్పటికే నోటీసులు జారీచేశాం. సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న మిల్లర్లకు ఈ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కేటాయించలేదు. 2021-22 సీజన్‌కు సంబంధించిన బియ్యం బకాయిల వసూలు దాదాపు పూర్తయింది. ఈనెలాఖరులోగా నిర్దేశిత లక్ష్యం సాధిస్తాం. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం.

– ప్రేమ్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి

చివరి శ్వాస వరకూ ప్రజల వెంటే ఉంటా

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని/రామగుండం/జ్యోతినగర్/కోల్‌సిటీ: తన చివరి శ్వాస వరకూ రామగుండం ప్రాంత ప్రజల వెంటే ఉంటానని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఎమ్మెల్యేగా పదవీ ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారి ఆదివారం రామగుండం ప్రాంతానికి చేరుకున్న రాజ్‌ఠాకూర్‌కు నియోజకవర్గ ప్రజలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆయా ప్రాంతాల్లో ఆయన మాట్లాడారు. ప్రజలు తనపై నమ్మకంతో అధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతీసమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకువస్తానని, ఆరు గ్యారంటీలను వందరోజుల్లో అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, ముస్తాఫా, గట్ల రమేశ్, యుగేందర్, చుక్కల శ్రీనివాస్, బదావత్ శంకర్‌నాయక్, మారెల్లి రాజిరెడ్డి, తిప్పారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



టికెట్ కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే ఠాకూర్

గొప్పగా అభివృద్ధి చేస్తా

కోల్‌సిటీ(రామగుండం): నియోజవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంచే పథకాలను అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్య చికిత్సలకు డబ్బుల్లేక ఇబ్బందులు ఎదుర్కొన్న చాలా మంది పేదలకు ఆరోగ్యశ్రీ సృష్టికర్త, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ద్వారా నియోజకవర్గంలో ప్రజలకు రూ.12లక్షల వరకు సాయం చేయించానని గుర్తుచేశారు. కాలుష్య కేంద్రమైన రామగుండంలో అనేకవ్యాధులతో చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. పక్షవాతం, గుండె తదితర వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం టికెట్ కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో కొంతదూరం ప్రయాణం చేశారు. డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, డీఎం మేనేజర్ నాగభూషణం, డిప్యూటీ డీఎంహెచ్‌వో కపాబాయి, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ పాల్గొన్నారు.

ఫోన్ చేస్తే సమస్య పరిష్కరిస్తా

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: అఖండ మెజార్టీతో విజయం అందించిన ప్రజలకు రుణపడిఉంటానని, ఒక్క ఫోన్ చేస్తే సమస్య పరిష్కరిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా ఎన్నికై పదవీ ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారి ఆదివారం జిల్లాకు చేరుకున్నారు. సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ వద్ద పార్టీశ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే పెద్దపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. పెద్దకల్వలలో కాంగ్రెస్ నాయకులు పెగడ రమేశ్‌యాదవ్, రమేశ్, సలేంద్ర రాజయ్య, సంతోష్, రవి తదితరులు ఎమ్మెల్యేను సత్కరించారు. పెద్దపల్లిని శరవేగంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకోసం మంత్రి శ్రీధర్‌బాబు సహకారం తీసుకుంటానని చెప్పారు. పెద్దపల్లిలో బస్‌డిపో, ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. జెండా కూడలిలోనే కూరగాయల మార్కెట్ ఉంటుందని తెలిపారు. మున్సిపల్ సమస్యలపై త్వరలోనే అధికారులతో సమావేశం నిర్వహిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. నాయకులు కొలిపాక శ్రీనివాస్, రాజయ్య పోటాపోటీగా ఎమ్మెల్యేను గజమాలలతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, నాయకులు సురేశ్‌గౌడ్, జగదీశ్, సత్యనారాయణరెడ్డి, అల్లెంకి శ్రీనివాస్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తా

సుల్తానాబాద్ (పెద్దపల్లి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. పట్టణానికి చేరుకున్న ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బిరుదు సమత గజమాలతో సన్మానించారు. కత్తి బహూకరించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు తాండ్ర సదానందం, ఉట్ల వరప్రసాద్, అన్నయ్యగౌడ్, బిరుదు రాజమల్లు, మినుపాల స్వరూప, కల్లేపల్లి జానీ, వేగోళం అబ్బయ్యగౌడ్, చిలుక సతీశ్, దామోదర్‌రావు, రాజయ్య, రవి, రఫీక్, అమిరిశెట్టి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న విజయరమణారావు

ప్రజల నమ్మకం నిలబెడతా

సుల్తానాబాద్‌రూరల్: అధిక మెజారిటీతో తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలబెడతానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. భూపతిపూర్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా విజయరమణారావు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, సాయిరి మహేందర్, జానీ, వెంకటరమణ, రాజిరెడ్డి, తిరుపతి, బక్కయ్య, శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

పాలు, బ్రెడ్లు పంపిణీ

మంథని: మానవ హక్కుల ఆవిర్భావోత్సవం సందర్భంగా స్థానిక మాతాశిశు ఆరోగ్య కేంద్రం, సామాజిక వైద్యశాల, ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం పాలు, బ్రెడ్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ నల్మాస్ ప్రభాకర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ప్రమోద్ కుమార్, సామాజిక కార్యకర్తలు రంజిత్, ప్రసాద్, వినోద్, పుష్కర్ రమేశ్ పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఈసోమవారం నుంచి యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదివారం తెలిపారు. జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రతీ కుటుంబానికి అండగా ఉంటాం

- ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): తను వెన్నంటి ఉన్న ప్రతీ కుటుంబానికి అండగా ఉంటానని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణకుమార్ అన్నారు. శాసనసభ్యుడిగా విజయం సాధించి, పదవీ ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారి ఆయన ఆదివారం ధర్మారం చేరుకున్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. మల్లాపూర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. లక్ష్మణ్‌కుమార్ మాట్లాడారు. తన తుది శ్వాసవరకు ప్రజలను మరువలేనన్నారు. ధర్మారం మండలం తనకు రాజకీయ భిక్షపెట్టిందని గుర్తుచేశారు. ప్రతీ ఇంటికి పెద్ద కొడుకుగా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ కొడారి అంజన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, లావుడ్య రుప్లానాయక్, బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, నాయకులు చింతల ప్రదీప్‌రెడ్డి, కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, దేవి జనార్దన్, కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, జంగ మహేందర్‌యాదవ్, ధనకంటి స్వామి, గందం మహిపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు

అందని ప్రోత్సాహకం

- ఐదేళ్లు గడిచినా పైసా విడుదల కాలేదు
- నిరాశలో ఏకగ్రీవ పంచాయతీలు
- మళ్లీ ఎన్నికలకు సర్కారు కసరత్తు

రామగుండం: గ్రామపంచాయతీల్లో ఎన్నికల వ్యయం తగ్గించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ ఎన్నికలను ప్రోత్సహించింది. పాలకవర్గాన్ని ఏకగ్రీవం ఎన్నుకుంటే రూ.పది లక్షల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేస్తామని ప్రకటించింది. ఈ నిధులు వెచ్చించి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించింది. దీంతో జిల్లాలోని 13 గ్రామపంచాయతీలను ప్రజలు ఏకగ్రీవం చేసుకుని ఆదర్శంగా నిలిచారు. అప్పుడు కొత్తగా 65 గ్రామ పంచాయతీలు ఆవిర్భవించాయి. ఇందులో 13 పంచాయతీల కార్యవర్గాలను ఏకగ్రీం చేస్తూ ప్రజలు తీర్మానించారు. ఐదేళ్లు పూర్తయినా ఈ గ్రామ పంచాయతీలకు నయాపైసా రాలేదు. ఈలోగా బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగిపోయింది.



ఎల్లంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

ప్రోత్సహించిన ఎమ్మెల్యేలు..

అప్పటి ఎమ్మెల్యేలు ఆశావాహులను అందరినీ కలుసుకున్నారు. ఎన్నికల నిర్వహించకుండానే ఏకగ్రీవంగా పాలకవర్గాలను ఎన్నుకోవాలని సూచించారు. వారిలో సయోధ్య కుదిర్చి పాలకవర్గాలను ఏకగ్రీవం చేయడంలో సఫలమయ్యారు. అయితే, ఐదేళ్లు గడిచినా, మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్నా.. ప్రోత్సాహకంపై ఊసేలేకుండాపోయింది.

ఏకగ్రీవ పంచాయతీలు ఇవే..

పంచాయతీ	మండలం
ఎల్లంపల్లి	అంతర్గాం
ఓడేడు	ముత్తారం- మంథని
అబ్బిడిపల్లి	ఓదెల
బయ్యమ్మపల్లి	ఓదెల
లంబాడితండా	ఓదెల
గుర్రాంపల్లి	పెద్దపల్లి
కుర్మపల్లి	పెద్దపల్లి
ఆశన్నపల్లి	కాల్వశ్రీరాంపూర్
లక్ష్మీపూర్	కాల్వశ్రీరాంపూర్
లంబాడితండా	ధర్మారం
లోకపేట	ఎలిగేడు
దుబ్బపల్లి	సుల్తానాబాద్
నర్సయ్యపల్లి	సుల్తానాబాద్

ఆదేశాలు రాలేదు



ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రోత్సాహక నగదు అందజేస్తామని తొలుత ప్రకటించింది. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నగదు గురించి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– భూక్య యాదగిరి, ఎంపీడీవో, అంతర్గాం

కాంగ్రెస్ సర్కార్ దృష్టి పెట్టాలి



2024 జనవరి 30వ తేదీతో మా పాలకవర్గం గడువు పూర్తవుతుంది. ఆ లోగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకం అందజేయాలి. ఆశావాహులను ఎమ్మెల్యేలు సముదాయించి అభివృద్ధి కోసం పాలకవర్గాన్ని ఏకగ్రీవం చేసుకునేలా చేశారు. నగదు రాకపోవడం నిరుత్సాహానికి గురిచేస్తోంది.

– గుమ్ముల రవీందర్, సర్పంచ్, ఎల్లంపల్లి

క్లుప్తంగా

బేగంపేటలో వడ్ల లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

రామగిరి(మంథని):పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట ప్రధాన రహదారిపై హనుమాన్ ఆలయం మూలమలుపు వద్ద శనివారం రాత్రి వడ్ల లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న ఇంటిపై బోల్తా పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ కోనుగోలు కేంద్రం నుంచి వడ్ల బస్తాల లోడ్‌తో వస్తుండగా డ్రైవర్ అజాగ్రతతో ప్రమాదం చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరార్ అయినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో కెక్కర్ల కుమార్‌కు చెందిన ఇల్లు పూర్తిగా ధ్వంసమైనట్లు బాధితుడు వాపోయాడు.

ఆర్టీసీ బస్సులో బ్యాగ్ చోరీ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్‌లో ఆదివారం ఓ మహిళ నుంచి గుర్తు తెలియని దొంగలు బ్యాగ్ దొంగిలించారు. బాధితురాలి కథనం ప్రకారం.. రాయికల్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన ఆముద గంగు తన మేనకోడలుతో కలిసి జగిత్యాలకు పనినిమిత్తం వచ్చింది. ఇంటికెళ్లేందుకు కొత్త బస్టాండులో ఆర్టీసీ బస్సులో సీటు ఆపేందుకు ప్రయత్నించింది. అప్పటికే ఆమె మేనకోడలు బస్సు ఎక్కడంతో గుర్తు తెలియని వ్యక్తులు 'మీ మేనకోడలు బ్యాగు ఇవ్వమంటోంది.. ఇవ్వు ఆమెకిస్తా..' అని నమ్మించారు. నమ్మిన ఆమె చేతిలోని బ్యాగ్ ఇవ్వడంతో అక్కడి నుంచి పరారయ్యారు. బ్యాగులో రూ.పదివేలు, సెల్‌ఫోన్ ఉందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి దుర్మరణం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌లో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు కరెంటుపోల్‌ను బైక్‌తో ఢీకొని ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్ తెలిపిన వివరాలు. పొత్తూరుకు చెందిన కుర్మ అశోక్ కొడుకు మహేశ్(20) శనివారం రాత్రి బైక్‌పై పొత్తూరు నుంచి ఇల్లంతకుంట వైపు వెళ్తుండగా కందికట్కూర్ శివారులో కరెంటుపోల్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సాక్షి' స్పెల్ బీ-మ్యాథ్ బీ పోటీలు

- సాధన స్కూల్లో సెకండ్ లెవల్ నిర్వహణ
- పరీక్షలకు ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు

SAKSHI MATH BEE 2023-24



సాధన పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

SAKSHI SPELL Bee 2023-24

SAKSHI సాక్షి SAKSHI TV SAKSHI DIGITAL MEDIA GROUP

కరీంనగర్ కల్చరల్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ జ్యోతినగర్‌లోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో నిర్వహించిన సాక్షి స్పెల్ బీ-మ్యాథ్ బీ-2023 జిల్లా సెకండ్ లెవల్ పరీక్షకు స్పందన వచ్చింది. విద్యార్థులు ఉత్సాహంగా హాజరై, ఇంగ్లిష్‌లో మెళకువలు, గణితంలో కొత్త ఫార్ములాలను నేర్చుకున్నారు. కేటగిరీ-1లో భాగంగా 1, 2వ తరగతుల విద్యార్థులకు, కేటగిరీ-2లో 3, 4వ తరగతుల విద్యార్థులకు, కేటగిరీ-3లో 5, 6, 7వ తరగతులు విద్యార్థులకు, కేటగిరీ-4లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. విజేతలకు మూడో లెవల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతాయని సాక్షి బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. సాధన స్కూల్ చైర్మన్ శ్రీనివాస్‌రావు, సాక్షి అడ్వర్టయిజ్‌మెంట్ ఆఫీసర్ వేముల శ్రీనివాస్, టీచర్ ధనలక్ష్మి, ప్రకాశ్, లింగమూర్తి, తిరుపతి తదితరులున్నారు.

అందరికీ ఉపయోగం



స్పెల్ బీ-మ్యాథ్ బీ లాంటి పరీక్షలు ప్రతీ సంవత్సరం పెట్టాలి. ఇవి అందరికీ ఉపయోగపడేవి. నేను ఇంగ్లిష్‌లో కొన్ని కొత్త పదాలు నేర్చుకున్నాను.

– ఎం.ఆదివ, సాధన స్కూల్

పరీక్ష బాగా రాశాను



సెకండ్ లెవల్ పరీక్ష బాగా రాశాను. ఇంగ్లిష్‌లో కొత్త పదాలను తప్పులు లేకుండా రాసే అవకాశం దొరికింది. మా ఫ్రెండ్స్ కూడా బాగా రాశారు.

– అదితి రెడ్డి, రావూస్ ఈ-టెక్నో స్కూల్

రాష్ట్రస్థాయికి అర్హత సాధిస్తా



స్పెల్ బీ పరీక్షతో ఇంగ్లిష్‌పై అవగాహన పెరిగింది. రాష్ట్ర స్థాయికి పోటీలకు అర్హత సాధిస్తా. వేరే సబ్జెక్టుల్లో కూడా ఇలాంటి పరీక్ష పెట్టాలి.

–సాయిప్రియ, సాధన స్కూల్

థాంక్స్ టు సాక్షి



నేను ఫస్ట్ టైం సాక్షి స్పెల్ బీ పరీక్ష రాశాను. చాలా కొత్త పదాలు నేర్చుకున్నాను. తర్వాత రౌండ్‌కు సెలక్ట్ అవుతా. థాంక్స్ టు సాక్షి.

– షిఫా, రావూస్ ఈ-టెక్నో స్కూల్

మొదటిసారి రాశాను



నేను మొదటిసారి సాక్షి స్పెల్ బీ పరీక్ష రాశాను. ఇంగ్లిష్ పదాలు పలకడం, రాయడం ఎలాగో తెలుసుకున్నాను. హ్యాపీగా ఉంది.

– ఎస్.అక్షయ్, సాధన స్కూల్

కొత్త కాన్సెప్ట్



విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడం కోసం సాక్షి మీడియా ఇలాంటి పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉంది. పుస్తకాలతో పోలిస్తే ఇది కొత్త కాన్సెప్ట్.

–మనోగన, రావూస్ ఈ-టెక్నో స్కూల్

నెట్టింట కోరుట్ల జంట

- ఆకట్టుకుంటున్న ఇన్‌స్టా వీడియోలు
- టిక్‌టాక్ నుంచి ఇన్‌స్టాగ్రామ్ దాకా..
- ఆరు నెలల్లో 1.60లక్షల మంది ఫాలోవర్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కోరుట్ల:

భర్త : ఇగో.. నా పర్సులో ఐదువేలు కనిపించడం లేదు.. నువ్వేగిట్ల తీశావా..?
భార్య : ఏంటి..? వినిపిస్తలే..
భర్త : పర్సులో ఐదువేలులేవు నువ్వు తీసినవా
భార్య వినిపిస్తలేదు.. ఈడకూసుంటే వినిపిస్తలేదు
భార్య : అర్ధరాత్రి 3 గంటలకు ఎవ్వలతో మాట్లాడినవ్..
భర్త : వినిపిస్తలే.. ఈడగుసుంటే నిజంగానే వినిపిస్తలే..
భార్య : గుర్రుగా చూస్తుంటే భర్త పరుగు..

ఇలా ఒకటి రెండు కాదు.. పదుల సంఖ్యలో వీడియోలు ఇపుడు ఇన్‌స్టాగామ్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఆరు నెలల వ్యవధిలో లక్షకు మించి సబ్‌స్క్రైబర్స్‌ను దాటిపోయి నెట్టింట హల్‌చల్ చేస్తున్న ఈ ఇన్‌స్టా జంట జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన వారే. వారే బింగి రాకేశ్, మేఘన జంట.

దుబాయ్‌లో టిక్‌టాక్ నుంచి..

కోరుట్లకు చెందిన బింగి రాకేశ్ పదేళ్ల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ ఐటీ కంపెనీలో టెక్నీషియన్‌గానే పనిచేస్తూ తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని తపన పడేవాడు. ముందుగా టిక్‌టాక్‌లో సోలో వీడియోలు చేశాడు. ఈ వీడియోలకు స్పందన రావడంతో మరిన్ని వీడియోలు చేస్తూ నెటిజన్లను ఆకట్టుకున్నాడు. తర్వాత ఇండియాలో టిక్‌టాక్ బ్యాన్ కావడంతో రాకేశ్ వీడియోలు చేయడంలో కొంత వెనకబడ్డాడు. రెండేళ్ల క్రితం దుబాయ్ నుంచి కోరుట్లకు వచ్చిన రాకేశ్.. ఉపాధి కోసం ఫిష్ అడ్డా అనే హోటల్ పెట్టాడు. అనంతరం ఇన్‌స్టాగాంపై దృష్టి సారించాడు.

జీవిత భాగస్వామి సహకారంతో..

మొదట సోలో వీడియోలు చేసి లక్షలాది మందిని ఆకట్టుకున్న బింగి రాకేశ్ కోరుట్లకు వచ్చిన తరువాత తన భార్య మేఘన సహకారం తీసుకున్నాడు. మొదట ఇన్‌స్టా వీడియోలు చేయడానికి ఇబ్బందిపడినా.. తర్వాత ఒకరికొకరు పోటీపడి ఇన్‌స్టా వీడియోల్లో నటిస్తూ ఆకట్టుకుంటున్నారు. భర్తతో కలిసి ఇన్‌స్టాలో చేస్తున్న వీరిద్దరు చేస్తున్న వీడియోలు గంభీరంగా మొదలై కడుపుబ్బ నవ్వించే తీరుగా ముగియడంతో చాలామంది నెటిజన్లు ఎంతగానో ఇష్టపడి చూస్తున్నారు. ఆరునెలల వ్యవధిలో వీరి ద్దరూ కలిసి చేసిన వీడియోలను ఇన్‌స్టాగాంలో 1.64 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉండటం విశేషం.

ఉపాధికి ఊతం..

రాకేశ్, మేఘన జంట చేస్తున్న ఇన్‌స్టా వీడియోలతో ఉపాధికి అవకాశం దొరుకుతోంది. వీరి వీడియోలకు ప్రేక్షకులతోపాటు సబ్‌స్క్రైబర్స్ పెరుగుతుండటంతో సారీ కలెక్షన్స్, గిఫ్ట్ ఆర్టికల్స్, బేబీ స్టూడియోలు, ఇతరత్రా కంపెనీలు ప్రమోషన్స్ కోసం యాడ్స్ అందిస్తున్నాయి. ఈ యాడ్స్‌తో ప్రతినెలా రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. ఓ వైపు పాపులారిటీ, మరోవైపు ఆదాయం రావడంతో ఈ జంట మరింత ఉత్సాహంతో వీడియోలు సిద్ధం చేస్తున్నారు. ఈ వీడియోల్లో మ్యూజిక్ మిక్సింగ్, ఎడిటింగ్ వంటి పనులను బింగి రాకేశ్ స్వయంగా చేస్తుండటం గమనార్హం. రానున్న కాలంలో జనం మెచ్చే రీతిలో మరిన్ని కపుల్ వీడియోలు తీయడానికి సన్నాహాలు చేస్తున్నామంటున్నారు రాకేశ్-మేఘన జంట.



సినిమాల్లో నటించాలని ఉంది

– బింగి రాకేశ్, మేఘన

నా మాటలో ఉన్న గాంభీర్యం.. నా భార్య మోములో వెంటవెంటనే మారిపోయే హావాభావాలు మాకు కలిసొస్తున్నాయి. మేమిద్దరం చేసిన ప్రతి కపుల్ వీడియో నెట్టింట ఫేమస్ అయ్యాయి. కొన్ని యూట్యూబ్ చానళ్లు, ఇతరత్రా చానళ్ల ఆఫర్లు ఇస్తున్నప్పటికీ సొంతంగా ఎదిగి సినిమాల్లో లేదా ఫోక్ సాంగ్స్‌లో నటించాలని ఉంది. మాకు ఆర్థికంగా ఎవరైనా మద్దతిస్తే మరిన్ని మంచి వీడియోలతో కోరుట్లకు మంచి పేరు తెస్తాం.

ఇన్‌స్టాగామ్ ఐడీ: రాకేశ్_బింగి6

ట్రాలీఆటో ఢీకొని ఒకరి మృతి

- అపస్మారక స్థితిలో మరొకరు
- దైవదర్శనానికి వెళ్లివస్తుండగా కొదురుపాక వద్ద ఘటన



పూర్ణచందర్ (ఫైల్)



గాయపడిన సాయి కిరణ్

బోయినపల్లి(చొప్పదండి): దైవ దర్శనాకి వెళ్లి వస్తుండగా.. ట్రాలీ ఆటో ఢీకొని ఒకరు మృతి చెందడంతోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బోయినప్లి మండలం కొదురుపాక పరిసరాల్లో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. వరంగల్ జిల్లా కాజీపేటకు చెందిన సిరిమల్ల పూర్ణచందర్(39), నూతి సాయికిరణ్(27) వేములవాడ రాజన్న దర్శనానికి బైక్‌పై వచ్చారు. దర్శనం అనంతరం బైక్‌పై వేములవాడ నుంచి కరీంనగర్ వైపు వెళ్తుండగా కొదురుపాక కేడీసీసీబీ పరిసరాల్లో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటనలో పూర్ణచందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడ్డ సాయికిరణ్‌ను కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయికిరణ్ కోమాలోకి వెళ్లి అపస్మారకస్థితిలో ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమయంలో బైక్‌పై వస్తున్న కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన జక్కని రాజుకు సైతం స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదంలో మృతిచెందిన పూర్ణచందర్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. పూర్ణచందర్‌కు తండ్రి శేఖర్, భార్య కవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య కవిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజశేఖర్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): క్రిమిసంహారక మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వరపల్లికి చంద్రగిరి రాజశేఖర్(28) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 5న మద్యం కోసం డబ్బులు కావాలని ఇంట్లో గొడవ పడ్డాడు. క్షణికావేశంలో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య భవాని, ఇద్దరు పిల్ల లు ఉన్నారు. రాజశేఖర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

లైంగిక దాడి నిందితుడి రిమాండ్

రాయికల్:పట్టణానికి చెందిన మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన సింగు నగేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. బాలిక ఒంటరిగా ఉండగా గమనించిన నగేశ్ ఈనెల 8న లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నగేశ్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆదివారం జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి విచారణ చేపట్టి నగేశ్‌ను రిమాండ్‌కు తరలించారని ఎస్సై వివరించారు.

ధర్మారంలో కాంగ్రెస్ ఫ్లెక్సీలు ధ్వంసం

- యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



ధ్వంసం చేసిన ఫ్లెక్సీలు

ధర్మారం(ధర్మపురి):పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆదివారం తెల్లవారు జామున కొందరు యువకులు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై సత్యనారాయణ.. తన సిబ్బందితో కలిసి యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ధర్మపురి ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారి ధర్మారం మండల కేంద్రానికి వస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతూ కాంగ్రెస్ నాయకులు శనివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కొందరు బీఆర్ఎస్‌కు చెందిన యువకులు మద్యం మత్తులో ఆదివారం తెల్లవారుజామున ఫ్లెక్సీలు ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. స్నేహితుడి బర్త్‌డే పార్టీకి వెళ్లిన సదరు యువకులు.. ఫ్లెక్సీలను చూసి ధ్వంసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాకపోవటంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు వివరించారు.

రైల్వేస్టేషన్‌లో యాచకుడి మృతి



వెంకటయ్య మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఓ యాచకుడు మృతిచెందాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. విటారి వెంకటయ్య(87) అనే యాచకుడు జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి గ్రామంలో కొన్నేళ్లు ఓ ఇంట్లో అద్దెకు ఉన్నాడు. తర్వాత ఖాళీ చేసి, జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో ఉంటున్నాడు. అక్కడే బసవయ్య వేషధారణలో యాచిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న వెంకటయ్య శనివారం చనిపోయాడు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువుల వివరాలు తెలియకపోవడంతో మున్సిపల్ అధికారులకు సమాచారం అందించి, దహన సంస్కారాలు పూర్తి చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

- నిందితుడిని చితకబాదిన స్థానికులు



నిందితుడికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

జగిత్యాలక్రైం : జగిత్యాలలోని వాణినగర్‌కు చెందిన మతిస్థిమితం లేని రాజు (12)ను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన వ్యక్తిని ఆదివారం స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వాణినగర్ ప్రాంతానికి చెందిన కొక్కుల గోపి, శైలజా దంపతుల కుమారుడు రాజు ఇంటిబయట ఆడుకుంటుండగా అలీ అనే వ్యక్తి మాయమాటలు చెప్పి కొత్త బస్టాండ్ వద్దకు తీసుకెళ్లాడు. రాజు స్నేహితులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే అలీ రాజుతో బస్సు ఎక్కే ప్రయత్నం చేస్తున్నాడు. స్థానికులు, కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని అలీని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. రాజును సురక్షితంగా ఇంటికి తీసుకవచ్చారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ



పోలీస్‌స్టేషన్‌లో రోదిస్తున్న వృద్ధురాలు

జగిత్యాలక్రైం:జిల్లా కేంద్రంలోని శివవీధిలో సిగరెట్ కోసం వచ్చిన గుర్తు తెలియని అగంతకులు ఓ వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ చేశారు. ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. శివవీధికి చెందిన బోనగిరి ఇందిరా కిరాణ దుకాణం నిర్వహిస్తోంది. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి సిగరెట్ కొన్నారు. ఆమె ఒంటరిగా ఉండడాన్ని గమనించి ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. వృద్ధురాలు కేకలు వేయడంతో స్థానికులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. పట్టణ ఎస్సై అబ్దుల్‌రహీం సంఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'మహాలక్ష్మి, చేయూత'ను సద్వినియోగం చేసుకోండి

- పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

మంథని:ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, చేయూత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ కోరారు. స్థానిక బస్‌స్టాండ్‌లో ఆదివారం ఆయన మహాలక్ష్మి పథకం ప్రారంభించారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తెచ్చారు. స్థానిక మాతాశిశు ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు, ట్రాన్స్ జెండర్లు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్‌స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో చేయూత ద్వారా రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసాయాన్ని రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ రాజయ్య, ఎంపీపీ కొండా శంకర్, కౌన్సిలర్లు రమాదేవి, హనుమంతరావు, ఆరోగ్య మిత్ర సంగీత పాల్గొన్నారు.

రాజన్నకు జనజాతర

- కోడెమొక్కులు చెల్లించిన భక్తులు
- దర్శనానికి ఐదు గంటల సమయం



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులు



ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కార్తీకమాసం చివరి అంకానికి చేరుతుండడంతో చలిని సైతం లెక్కచేయకుండా భారీగా భక్తులు తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. దర్శనానికి దాదాపు ఐదు గంటల సమయం పట్టడంతో క్యూలైన్‌లో నిల్చునేందుకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకొని, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. వసతిగదులు ఉన్న ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేక దుర్గంధం వస్తోందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఒక్క రోజే భక్తుల ద్వారా రూ.50 లక్షల ఆదాయం సమకూరింది.